ఆదమరిస్తే అంతే..!

- నల్లకుంట డివిజన్ పరిధిలో అస్తవ్యస్తంగా మ్యాన్‌హోళ్లు
- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు
- వాహనదారులకు తప్పని తిప్పలు


న్యూనల్లకుంట బ్రాహ్మణ హాస్టల్ ఎదురుగా..


దత్త పీఠం వద్ద మ్యాన్‌హోల్ ఇలా..


బాయమ్మ ఇంటి సమీపంలో..


గోల్నాక కల్లు కాంపౌండ్ పక్క లేన్‌లో..

అభివృద్ధి పనుల కోసం జీహెచ్ఎంసీ కోట్లాది రూపాయల నిధులు కేటాయిస్తోంది. అదే విధంగా అభివృద్ధి పనుల కోసం స్థానిక శాసనసభ్యుడు తన బడ్జెట్ ద్వారా కోట్లాది రూపాయలు మంజూరు చేయిస్తున్నారు. కాగా జలమండలి అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా నల్లకుంట డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారులు, అంతర్గత వీధులో ఏర్పాటు చేస్తున్న మ్యాన్‌హోళ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నారు. దీంతో ఎగుడుదిగుడుగా నిర్మిస్తున్న మ్యాన్‌హోళ్ల కారణంగా వాహనదారులు తరుచూ ప్రమాదాల బారినపడి గాయాల పాలవుతున్నారని స్థానికులు అంటున్నారు. ఎగుడుదిగుడుగా నిర్మించిన మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపట్టాలని స్థానిక ప్రజాప్రతినిధికి, జలమండలి అధికారులు పలు మార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆయా బస్తీలు, కాలనీల వాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎగుడు దిగుడుగా ఉన్న మ్యాన్ హోళ్లకు మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – నల్లకుంట


తిలక్‌నగర్ నుంచి నల్లకుంట ఫీవర్ ఆస్పత్రికి వచ్చే మెయిన్ రోడ్డులోని మహేష్ పాన్‌షాప్ వద్ద మ్యాన్‌హోల్ దుస్థితి ఇలా..



తిలక్‌నగర్ రైల్వేట్రాక్ సమీపంలోని ఎంఆర్‌సీబీ పక్కలేన్‌లో మ్యాన్‌హోళ్లు


నల్లకుంట మయూరీ లేన్‌లో..


నల్లకుంట రైల్వే ట్రాక్‌లేన్‌లో రోడ్డుకు ఎత్తుగా మ్యాన్‌హోల్



నల్లకుంట ఎస్‌బీఐ పక్కలేన్‌లో మ్యాన్‌హోళ్లు


ఫీవర్ నుంచి పాతరామాలయం వెళ్లే మలుపు వద్ద..


నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా వద్ద శైలా కేఫ్ వద్ద ఇలా.


విజ్ఞాపురికాలనీ(విద్యానగర్) రైల్వేస్టేషన్ సమీపంలో..

మన సంప్రదాయాలు ప్రపంచానికే తలమానికం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మన దేశ సంస్కృతీ సంప్రదాయాలు ప్రపంచానికే తలమానికమని సీనియర్ సిటిజన్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.పుల్లయ్య, మాచర్ల రంగయ్య అన్నారు. శుక్రవారం పద్మశాలి కమ్యూనిటీహాల్‌లో కురుగంటి కళాక్షేత్రం ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ విదేశాలలో కూచిపూడి నృత్యానికి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. అనంతరం కళాకారులకు బహుమతులు ప్రదానం చేశారు.

విద్యార్థులను నిర్బంధించడం సరికాదు

బీఎల్ఎఫ్ అధ్యక్షుడు దండి వెంకట్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: హెచ్‌సీయూలోని 400 ఎకరాల భూములను ప్రభుత్వం వేలం వేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న విద్యార్థులను నిర్బంధించడం సరికాదని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు. గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దండి వెంకట్ మాట్లాడారు. సెంట్రల్ యూనివర్సిటీ భూములను విక్రయించొద్దని విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యమకారులు వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. ఆందోళనకారులపై లాఠీచార్జ్ చేయడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. గతంలో ఇందిరాగాంధీ హెచ్‌సీయూ అభివృద్ధి కోసం కేటాయించిన భూములను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమ్మడం సరైనది కాదన్నారు.

ప్రబోధాశ్రమానికి తరలిన భక్తులు

కాచిగూడ: జగద్గురువు ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర్ జన్మదిన వేడుకలు ఈనెల 5వ తేదీన అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం చిన్న పోడమల గ్రామంలోని ప్రబోధాశ్రమం శ్రీకృష్ణ మందిరంలో జరుగనున్నాయి. ఈ వేడుకలకు తెలంగాణ త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సుమారు 400 మంది భక్తులు శుక్రవారం కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో ఇందూ జ్ఞాన వేదిక అధ్యక్షుడు దేవేందర్, ప్రతినిధులు రవీందర్‌రెడ్డి, పంచాక్షరి, ఉపేందర్, రామరాజు, రామకృష్ణ, సుధాకర్, కుమార్, లతా, లలిత, వసంత, కవిత, మాధవి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివం సేవాదళ డే

నల్లకుంట: సేవా దళం ఆధ్వర్యంలో శుక్రవారం నల్లకుంట శివం మందిరంలో శివం 52వ వార్షికోత్సవ సేవాదళ డే ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం వేకువజామున ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, మంగళ హారతితో వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 5.45 గంటలకు వేద పఠనం, జ్యోతి ప్రజ్వలన జరిగింది. అనంతరం శివం వైభవం, సేవా దళం సభ్యులను సన్మానించారు. సకల సంకట విమోచిని 6వ సత్సంగం కోట శివకుమార్, ఎస్ఎస్ఐహెచ్ఎల్ పూర్వ విద్యార్థులతో 'రామ కథ రస వాహిణి'నిర్వహించారు.

వృద్ధుడి అదృశ్యం



చిక్కడపల్లి: ఓ వృద్ధుడు అదృశ్యమైన సంఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్ తెలిపిన వివరాల ప్రకారం... పశ్చిమ బంగాల్‌కు చెందిన సుకుమార్ దాస్(77), అశోక్‌నగర్‌లోని మనుమరాలు పుష్ప ఇంట్లో ఉండి వెళ్దామని కొద్ది రోజుల క్రితమే వచ్చాడు. కాగా చాయ్ తాగి వస్తానని చెప్పి బయటకి వెళ్లి తిరిగి రాలేదు. అతడికి హైదరాబాద్ కొత్త కావడంతో దారి మర్చిపోయి ఉండొచ్చని భావిస్తున్నారు. అతడికి బెంగాలీ భాష మాత్రమే తెలుసన్నారు. వివరాలు తెలిసిన వారు చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో లేదా ఫోన్ నం .87126 60162లో తెలుపాలని కోరారు.

రచనలు ఆలోచన శక్తిని పెంచుతాయి


విద్యార్థులు రూపొందించిన 'తరంగిణి' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వేదాంత సూరి

అంబర్‌పేట: విద్యార్థి దశ నుంచే విద్యార్థులకు పుస్తక పఠనం, రచనల పట్ల ఆసక్తి పెంపొందించేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని మొలక మాసపత్రిక సంపాదకులు వేదంత సూరి తెలిపారు. శుక్రవారం శివంరోడ్ బతుకమ్మకుంట శ్రీరమణ కేంద్రం వద్ద గోషామహల్–అంబర్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో విద్యార్థులు రూపొందించిన 'తరంగిణి'పుస్తకాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇక్కడి ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ప్రయోత్మకంగా ఇలాంటి పుస్తకాన్ని ఎంతో సహనంతో రూపొందించడం అభినందనీయమని అన్నారు. పుస్తకంలో పరిసరాల పరిశుభ్రత, డబ్బు పొదుపుపై బ్యాంకింగ్ విధానాలు, ఐకమత్యం వంటి అంశాలతో పుస్తకాన్ని రూపొందించడం వారి ఆలోచన విధానలకు అద్దం పట్టేలా ఉన్నాయని తెలిపారు. అలాగే పాఠశాల గ్రంథాలయానికి 10 కథల పుస్తకాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గుమ్మన వేణుమాధవ్, ఉపాధ్యాయులు మహమ్మద్ యాదుల్లా, డాక్టర్ వజ్జల శరత్‌బాబు, రూపా, మాధురి, మూబిన్, వర్షిని పాల్గొన్నారు.

వడ్డెరల సమస్యలను పరిష్కరించాలి


డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కను సన్మానిస్తున్న సత్యనారాయణ, అంతయ్య

చిక్కడపల్లి: వడ్డెరలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వడ్డెర్ల లక్ష్య సాధన రాష్ట్ర అధ్యక్షుడు జేరిపేట సత్యనారాయణ, తెలంగాణ వడ్డెర(గన్ను దెబ్బ) సంఘం అధ్యక్షుడు ఎత్తరి అంతయ్య అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను వారు కలసి వడ్డెరలు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నగరంలో జేసీబీలపై పోలీసులు చలాన్‌లు అధికంగా విధిస్తున్నారని పేర్కొన్నారు. దీంతో వడ్డెరలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వడ్డెరలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

రామ నవమి శోభాయాత్రను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు

కాచిగూడ: శ్రీరామనవమి ఉత్సవ సమితి అంబర్‌పేట ఆధ్వర్యంలో ఈనెల 6న నిర్వహించనున్న రామ్ నవమి శోభాయాత్రను విజయవంతం చేయాలని ఉత్సవ సమితి కన్వీనర్ డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... శ్రీరాములవారు అందించిన విలువలు ప్రతిభింభించే విధంగా మహోన్నతమైన శోభాయాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శోభాయాత్రలో 500లకు పైగా వలంటీర్లు స్వచ్ఛందంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. హిందూ జాతి సమైఖ్యత కోసం జరిగే ఈ శోభాయాత్రలో ప్రతి హిందూ కుటుంబం నుంచి ఇద్దరు చెప్పు పాల్గొనాలని కోరారు. ఈ శోభాయాత్ర చిరస్థాయిగా గుర్తుండిపోయే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. శోభాయాత్ర అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్స్ వద్ద ప్రారంభమై కాచిగూడ చౌరస్తా వీరసావర్కర్ విగ్రహం వద్ద ముగుస్తుందని తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తెలంగాణ పార్టీ అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, శ్రీ చైతన్య శక్తి పీఠం, సిద్ధ మహాయోగ పీఠం పీఠాధిపతి శ్రీచైతన్యానంద మహారాజ్ హాజరవుతారని తెలిపారు.

వైశ్య హాస్టల్ ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా జయప్రకాష్ రామ్

కాచిగూడ: వైశ్య హాస్టల్ ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా కొత్తూరు జయప్రకాష్ రామ్, కార్యదర్శిగా కొండ్లె మల్లికార్జున్, కోశాధికారిగా వెంపటి మధు ఎన్నికయ్యారు. శుక్రవారం కాచిగూడలోని వైశ్య హాస్టల్‌లో నూతనంగా ఎన్నికైన కొత్తూరు జయప్రకాష్ రామ్, కొండ్లె మల్లికార్జున్, వెంపటి మధు బాధ్యతలు స్వీకరించారు.

ఆర్‌యూవీఎస్ దరఖాస్తులను వార్డు కార్యాలయాల్లో ఇవ్వాలి


సమావేశంలో అంబర్‌పేట తహసీల్దార్ వీరబాయి

అంబర్‌పేట: రాజీవ్ యువ వికాసం పథకం (ఆర్‌యూవీఎస్) దరఖాస్తులను తమ పరిధిలోని జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయాల్లో అందజేయాలని దరఖాస్తుదారులకు అంబర్‌పేట తహసీల్దార్ వీర బాయి సూచించారు. శుక్రవారం అంబర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో 'రాజీవ్ యువ వికాసం పథకం'పై సమావేశం జరిగింది. దరఖాస్తుదారులు మీ–సేవలో దరఖాస్తు చేసుకున్న తర్వాత రసీదుతో పాటు దరఖాస్తును జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయాల్లో అందజేయాలని కోరారు. రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, వృత్తికి సంబంధించిన ధ్రువపత్రాలను విధిగా జతచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్ అధికారి రజిత, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న ట్రైకార్ రుణాలు ఇవ్వాలి


ఎస్వీ కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.శ్రీరామ్‌నాయక్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పెండింగ్‌లో ఉన్న రూ.218 కోట్ల ట్రైకార్ రుణాలను వెంటనే ఇవ్వాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీరామ్ నాయక్ డిమాండ్ చేశారు. శుక్రకవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శ్రీరామ్ నాయక్ మాట్లాడుతూ.... రాజీవ్ యువ వికాసం పేరుతో నూతన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం హడావిడిగా ప్రారంభించటం వల్ల ట్రైకార్ సంస్థ పూర్తిగా నిర్వీర్యం అయ్యే ప్రమాదం ఉందన్నారు. గత ప్రభుత్వం ట్రైకార్ సంస్థ ద్వారా గిరిజన యువతి, యువకుల నుంచి వేలాది దరఖాస్తులను స్వీకరించి అందులో 30వేల మందికి రుణాలను మంజూరు చేస్తూ లబ్ధిదారులను గుర్తించిందని అన్నారు. అయితే వీరి ఖాతాలలో జామ చేయడానికి రూ.218కోట్ల చెక్కులను సిద్ధం చేసి ఆర్థికశాఖకు పంపించిందన్నారు. అయితే ఇప్పటికీ వారిఖాతాలో డబ్బులు పడలేదన్నారు. లబ్ధిదారులఖాతాలలో జమ చేయకపోతే ఏప్రిల్ 7న గిరిజన సంక్షేమ భవనం ముందు నిరసన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం అధ్యక్షులు ధర్మ నాయక్ , రమవత్ అజయ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

తుల్జాభవన్‌లో సీతారాముల కల్యాణం 6న

కాచిగూడ: కాచిగూడలోని తుల్జాభవన్ ధర్మశాల శ్రీరామ మందిరం ప్రాంగణంలో ఈనెల 6న శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తుల్జాభవన్ ధర్మశాల కార్యనిర్వహణాధికారి ఎస్.అంజనారెడ్డి తెలిపారు. శుక్రవారం తుల్జాభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఉదయం 10గంటలకు శ్రీసీతారాముల కల్యాణం ప్రారంభమవుతుందన్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. రాత్రి 7 గంటలకు ఉత్సవమూర్తుల పల్లకీ ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు. కల్యాణం చేయించాలనుకునే భక్తులు ముందుగా రసీదు తీసుకోవాలని కోరారు. కాచిగూడ భజన మండలి కళాకారులచే భజనలు, సంకీర్తనలు ఉంటాయని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు స్వామివారికి పూజాధికం, అలంకారం, పుష్పం, కుంకుమతో సహస్రార్చనలు జరుగుతాయని తెలిపారు.

మున్నూరుకాపు భవన్‌లో...

కాచిగూడ: మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొ. మ్యాడం వెంకట్‌రావు తెలిపారు. హిందూ బంధువులందరూ పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కాచిగూడలోని మున్నూరుకాపు భవన్ మ్యాడం అంజయ్య హాల్‌లో సాయంత్రం 6గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు.

15లోగా శ్రమశక్తి అవార్డులకు దరఖాస్తులు చేసుకోవాలి

చిక్కడపల్లి: రాష్ట్ర కార్మికశాఖ ఆధ్వర్యంలో మే డే వేడుకలను నిర్వహిస్తున్నామని ఆ శాఖ సంయుక్త కమిషనర్ సునితాగోపాల్‌దాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా బెస్ట్ మేనేజ్‌మెంట్ అవార్డులు, ట్రేడ్ యూనియన్ నాయకులు, మహిళలకు శ్రమశక్తి అవార్డులను మే 1వ తేదీన రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో ప్రదానం చేస్తామన్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తిగల వారు ఈనెల 15వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో www. labour telangana.gov.in దరఖాస్తు చేయాలన్నారు. ఆన్‌లైన్‌లో చేయలేని వారు ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని టి.అంజయ్య కార్మిక సంక్షేమ భవన్‌లో దరఖాస్తు ఫారాలను పొందాలన్నారు.

ఇద్దరిని గాయపరిచిన వ్యక్తికి 10రోజుల జైలు

కవాడిగూడ: అంబేడ్కర్‌నగర్‌లో నివాసం ఉండే టి.కృష్ణ వృత్తిరీత్యా ఆటో డ్రైవర్. తన స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడుతున్న సమయంలో సమీపంలో ఉండే బాబురావు అనే వ్యక్తి ఇంట్లోకి బాలు వెళ్లింది. దీంతో వారు పలుమార్లు కృష్ణకు చెప్పినా పట్టించుకోలేదు. పదేపదే వారి ఇంట్లోకి బాల్ రావడంతో ఆగ్రహంతో పక్కన ఉన్న హుస్సేన్‌సాగర్ మూసీ కాలువలో బాల్‌ను పడేశారు. దీంతో ఆగ్రహానికి గురైన కృష్ణ వారితో గొడవకు దిగాడు. దీంతో బాధితులు దోమలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కృష్ణపై కేసు నమోదు చేశారు. శుక్రవారం నిందుతుడు కృష్ణను కోర్టులో హాజరు పరచగా అతడికి 10రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై నిరంజన్ తెలిపారు.

రైలు ఢీకొని వైద్యురాలు మృతి

కాచిగూడ: రైలు ఢీకొని ఓ వైద్యురాలు మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్. ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... మలక్‌పేట కాలడేరా ప్రాంతానికి చెందిన ఎస్‌కే మహ్మద్ ఆలీ కుమార్తె డాక్టర్ ఆలీషా (26) కాచిగూడలోని బస్తీ దావాఖానాలో పనిచేస్తోంది. శుక్రవారం మలక్‌పేట రైల్వే స్టేషన్‌లో పట్టాలు దాటుతుండగా కర్నాటక సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చదువుతోనే సమాజంలో మహిళలకు గౌరవం

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద


మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదను సన్మానిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ జె.అచ్యుతాదేవి

కాచిగూడ: ప్రస్తుత పోటీ ప్రపంచంలో, సమాజంలో చదువుతోనే మహిళలకు గౌరవం లభిస్తుందని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. శుక్రవారం నారాయణగూడలోని రాజా బహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాల అలుమ్నీ సంఘం ఆధ్వర్యంలో 'ఇన్‌స్పిరా–2025'పేరుతో అలుమ్నీ ఫెస్ట్ నిర్వహించారు. కార్యక్రమానికి నేరెళ్ల శారద ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహిళా విద్య సమాజ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. అలుమ్నీ సంస్థ కళాశాల అభివృద్ధికి సహకరించాలన్నారు. సమాజానికి మరింత సేవ చేయాలని ఆమె ఆకాంక్షించారు.

◆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.అచ్యుతాదేవి మాట్లాడుతూ.. అలుమ్నీ సంఘం సహకారంతో కళాశాల మరింత అభివృద్ధి చెందుతోందన్నారు. మహిళా విద్యను పురోగమన మార్గంలో తీసుకెళ్లడానికి కళాశాల యాజమాన్యం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సంయుక్త, సుమిత్ర జైస్వాల్, నేహా జైస్వాల్, హరిత, బి.ప్రవళిక, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

శ్యాంమందిర్‌లో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గౌతంరావు పూజలు


కాచిగూడలోని శ్యామ్ మందిర్‌లో పూజలు నిర్వహించిన గౌతంరావు, బీజేపీ నాయకులు

కాచిగూడ: హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థిగా డాక్టర్ ఎన్.గౌతంరావు పేరును పార్టీ అధిష్టానం ప్రకటించింది. ఈ సందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ ఎన్.గౌతంరావు కాచిగూడలోని శ్యామ్‌మందిర్‌లో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. సోషియాలజీలో డాక్టరేట్ పొందిన గౌతంరావు విజ్ఞాన భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ చైర్మన్‌గా ఉన్నారు. గతంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. ఏప్రిల్ 23న ఈ స్థానానికి 23న పోలింగ్ జరగనుండగా, 25న ఓట్ల లెక్కింపును చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు కన్నె రమేష్‌యాదవ్, సి.నందకిషోర్ యాదవ్, ఎడెల్లి అజయ్‌కుమార్, సి.వినోద్ యాదవ్, ఎం.రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్ వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలి


ట్రాన్స్‌జెండర్ సమావేశంలో మాట్లాడుతున్న రచన ముద్రబోయిన

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్ వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని జాతీయ ట్రాన్స్‌జెండర్ హక్కులు కార్యకర్త రచన ముద్ర బోయిన డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ట్రాన్స్‌జెండర్ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రచన మాట్లాడుతూ... ప్రపంచంలో అత్యంత వివక్షతకు లైంగిక వేధింపులకు గురయ్యేది తామనని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ట్రాన్స్‌జెండర్ ఆత్మగౌరవాన్ని పెంపొందించే విధంగా బడ్జెట్‌ను కేటాయించాలని కోరారు. అరకొర బడ్జెట్‌ను కేటాయిస్తూ దారుణమైన వివక్షతను చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో మహిళా శిశు సంక్షేమ నుంచి విడదీసి ట్రాన్స్‌జెండర్ వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేసి దానికి చైర్మన్ డైరెక్టర్లను నియమించాలని కోరారు. టీపీఎస్‌కే అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్ కార్యకర్తలు లిల్లీ, స్వేచ్ఛ, ఆయూష తదితరులు పాల్గొన్నారు.

వరదనీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలి


జీహెచ్ఎంసీ అధికారులతో కలసి పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: వర్షం కురిసిన సమయంలో రోడ్లపై వరదనీరు నిలవకుండా జీహెచ్ఎంసీ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పావని అన్నారు. గురువారం కురిసిన వర్షానికి ఆయా ప్రాంతాలలో నిలిచిన నీటితో ఇబ్బందులు పడ్డామని స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆమె శుక్రవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డు జవహర్‌నగర్, అరుంధతినగర్, సబర్మతినగర్ ప్రాంతాలలో జీహెచ్ఎంసీ అధికారులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ముంపు ప్రాంతాలు, సమస్య ఉన్న కాలనీల్లో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, నవీన్‌కుమార్ ముదిరాజ్, రత్నసాయిచంద్, ఆనంద్‌రావు, స్థానిక నేతలు సాయి తరుణ్, నర్సింగ్‌రావు, బాబ్జీ, గుండు జగదీష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అభయ గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన


గానసభలో జరిగిన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం లో జనార్ధనామూర్తి, కళా శారద, ఎంకే రాము

చిక్కడపల్లి: త్యాగరాయ గానసభ ప్రాంగణంలో శుక్రవారం అభయ గణపతి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం వైభవంగా జరిగింది. ప్రముఖ రచయిత పురాణపండ శ్రీనివాస్ సూచన మేరకు శృంగేరి పండితుల సమక్షంలో విగ్రహ ప్రతిష్ఠాపన కనులపండువగా సాగింది. అరుదైన కృష్ణశిలతో రూపుదిద్దుకున్న రెండున్నర అడుగుల అభయ గణపతికి పూజారులు ప్రాణప్రతిష్ఠ చేశారు. ఈ కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనామూర్తి, ప్రధాన కార్యదర్శి కళా శారద, రసమయి సంస్థ అధ్యక్షుడు ఎంకే రాము, ప్రముఖ హాస్యావధాని, జర్నలిస్టు శంకరనారాయణ, ప్రముఖులు వంశీ రామరాజు, రామచంద్రమూర్తి, కళా దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

గోమాత సంరక్షణ మనందరి బాధ్యత

గోమాత సంరక్షణ మనందరి బాధ్యత అని దర్శనమ్ సంపాదకులు బ్రహ్మశ్రీ మరుమాముల వెంకటరమణశర్మ అన్నారు. శుక్రవారం రాత్రి కమలాకర చారిటబుల్ ట్రస్ట్, కమలాకర లలిత కళాభారతిల సంయుక్తాధ్వర్యంలో గానసభలో జరిగిన ఉగాది పురస్కారాల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ రంగాల నుంచి ఎంపిక చేసిన పలువురు ప్రముఖులకు పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు.